# గుడిబైట శివుడు



మాచిరాజు & కె. ఎల్. ప్రసాద్

''రేపు కార్తీక సోమవారం'' అనుకు న్నాడు నీలకంఠేశ్వరుడు.

అర్ధరాత్రి పన్నెండు గంటలవడానికి ఇంకా అరగంట ఉంది. నీలకంఠేశ్వరుని ఆలయం ఊరికి దూరంగా శ్మశానం మధ్యలో ఏనాటివో అయిన పురాతన చెట్లమధ్యన ఉంది.

అర్ధరాత్రి ఏదో ఊసుపోక గాలివీస్తోంది. చెట్ల ఆకులు నిశ్శబ్దంగా ఊగుతున్నాయి.

నక్కలు హాయిగా సంత్రుప్తిగా నిండుగా ఉన్నాయి.

పాలరాతిగోరీలు చల్లగా శవాల్లావున్నాయి.

వెన్నెల్లో శ్మశానం తెల్లగా, శవం మీద కప్పిన గుడ్డలా వుంది.

ఆలయం నిశ్శబ్దంగా గుడ్లగూబలా ఉంది.

నీలకంఠేశ్వరునికి ఆనందంగా ఉంది.

''రేపు కార్తీక సోమవారం'' అనుకు న్నాడు. అనుకుని గుడిబయటకొచ్చి నిల బడ్డాడు.

నిలబడి చుట్టూ చూశాడు.

అతని శ్మశాన సామ్రాజ్యం చల్లగా హాయిగా వుంది. జరగవలసిన పనులు యధావిధిగా జరుగుతున్నాయి.

సంతుప్తిగా ఉంది.

అప్పుడు నీలకంఠేశ్వరునికి ఓ చిలిపి కోరిక కలిగింది.

రేపు కార్తీక సోమవారం. భక్తకోటి తరలి వస్తుంది ఆలయానికి. గంటలు నిర్వి రామంగా మోగుతాయి.

ధూపదీప నైవేద్యాలు.

పూజలు. పునస్కారాలు.

దణ్ణాలు. సాష్టాంగ నమస్కారాలు.

పాటలు. పద్యాలు.

స్తోత్రాలు. శ్లోకాలు.

సరే బాగానేఉంది.

కానీ, ఈ భక్తుల్లో ఎవడు నిజమైన భక్తుడు? రేపు ఆలయానికి అందరికంటే ముందు వచ్చి ఎవడు తనని పూజిస్తాడు?

అట్టివాడు ఎవడు ?

నీలకంఠునికి ఆసక్తి పెరిగింది.

''అలాంటి వాడికి ధనకనక వస్తువాహ నాలు ప్రసాదించాలి'' అనుకున్నాడు.

* * *

ఊరు ఊరికే నిద్రపోతోంది.

వీధులు కళావిహీనంగా ఎండిపోయిన కాలవల్లా వున్నాయి.

ఊరు. ఊరికి రెండు చేతుల్లా యిటువైపు శ్మశానం. అటువైపు గుడిసెలు.

శ్మశానంలో చచ్చిపోయిన మనుషులు. గుడిసెల్లో బతికివున్న శవాలు. వెన్నెల పక్షపాతం లేనిది కాబట్టి, గుడిసెలమీదా పడుతోంది.

మిఠాయి చుట్టూ ముసిరిన ఈగల్లా వున్నాయి గుడిసెలు.

గుడిసెల్లో మనుషులు అందరూ నిద్రపోతున్నారు. గుడిసెల బయట కుక్కలు నిద్రపోతున్నాయి.

ఆ గుడిసెల్లో ఓ గుడిసె. ఆ గుడిసెలో ఓ మనిషికి మాత్రం నిద్రపట్టడంలేదు. ఆ మనిషి పేరు శివుడు.

''రేపు కార్తీక సోమవారం'' అనుకున్నాడు శివుడు. అలా అనుకున్నప్పుడు అతనికి చెప్పలేని ఆనందం కలిగింది.

నీలకంఠేశ్వరస్వామి కళ్లల్లో స్పష్టంగా కనిపించినట్టయింది.

శివుడు లేచినిలబడ్డాడు. పడుకున్న గోనె మడిచాడు. లాంతరు కొంచెం కాంతిని యిస్తోంది.

గుడిసె బయటకి నడిచాడు.

కార్తీకమాసం చలి కొద్ది కొద్దిగా వణికిస్తోంది. ఆకాశంలో నక్షత్రాలు కుప్పలు కుప్పలుగా, రాసులు రాసులుగా మెరిసి పడిపోతున్నాయి.

శివుడు నక్షత్రాలవైపు చూసి ఒంటిగంట అయిందనుకున్నాడు.

పక్కనే ఉన్న మురికి కాలువనుండి దుర్గంధం తెరలు తెరలుగా వస్తోంది.

బద్ధకంగా ఉంది శివుడికి.

తల విదిలించాడు. గుడిసెలోకి వెళ్లాడు. లాంతరు ఆర్పేశాడు. గుడిసె తలుపు వేశాడు.

బయటకి నడిచాడు.

కుక్కలు కింకా తెల్లవారలేదు. నిద్రపోతున్నాయవి. శివుడు గుడిసెలన్నీ దాటాడు.

ఊరు.

ఊరు కటువైపు శ్మశానం.

శ్మశానంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయం. ఆలయం !—భక్తులు !

శివుడికి భక్తి భావంలాంటి భావం మనసులో కదిలి కితకితలు పెట్టింది.

రాత్రి ఒంటిగంటన్నర. ఎక్కడో ఒకడూ యిద్దరూ నిశాచరులు తప్ప వీధుల్లో ఎవరూ లేరు. శివుడు గబగబానడుస్తున్నాడు.

సందుతిరిగితే సత్యంగాడి టీ కొట్టు. సందు తిరిగాడు శివుడు.

''ఆడిమీదికి చక్రం యిసిరేస్తాను''అంటున్నాడు సత్యం.

''ఎవురిమీదికేటి'' అంటూ వచ్చాడు శివుడు.

టీ కొట్టుదగ్గర మరో మనిషి. ఆ మనిషి పేరు పటాసుగాడు. వాడి అసలు పేరు వాడి తల్లికే తెలుసు. ఆ తల్లి ఈ లోకంలోలేదు. కాబట్టి వాడు పటాసుగాడనే పిలవబడుతున్నాడు.

ఆ పటాసుగాణ్ణి చూసిన వెంటనే శివుడికి భయం వేసింది.

పులిని చూసిన ఆవులా వెంటనే తలదించుకున్నాడు.

ఆవుని చూసిన పులిలా పటాసుగాడు మెల్లగా నవ్వాడు.

ఆ పటాసుగాడు ఎందుకు నవ్వేడు ?

జరిగిన సంగతిది !

పటాసుగాడికి శివుడు ఓ రూపాయి బాకీ ఆ బాకీ నెలరోజుల పాతది.

అందుచేత పటాసుగాడు పులి అవతారమూ, శివుడు ఆవు అవతారమూ ఎత్తారు. పులీ, ఆవూ ఆట శివుడికి ఏమాత్రం ఆనందకరంగా లేదు.

సరే, ఆ బాకీ అలా వుంది.

క్రితం రోజున, సాయిబు మాజిక్కు షో చూస్తూ నిలబడ్డాడు శివుడు. సాయి బుచప్పట్లు కొట్టమన్నాడు.

అందరూ కొట్టారు.

శివుడూ కొట్టేడు.

ఎవరినీ మాట్లాడొద్దన్నాడు సాయిబు.

మాట్లాడితే రక్తం కక్కుతూ ముందుపడి వున్న కుర్రాడు కల్లోకి వస్తాడన్నాడు.

శివుడు మాట్లాడొద్దనే అనుకున్నాడు మరి.

కానీ పటాసుగాడొచ్చి పక్కన నిలబడ్డాడు.

రూపాయి తెమ్మన్నాడు.

ఇప్పుడు మంత్రాల సాయిబు మాట్లాడొద్దన్నాడని ఊరుకుంటే ఎముకలు విరిచేస్తాడు పటాసుగాడు.

అంచేత ఆవు అంబా అన్నట్లు దీనంగా, దీనాతిదీనంగా ''రేపిస్తాను'' అన్నాడు.

ఆ గడువు యివాళతో తీరింది. రూపాయీ లేదు. కలా లేదు. కాని ముందు పటాసుగాడున్నాడు.

వాడిప్పుడు కొట్టినా కొట్టవచ్చు. అంచేత శివుడు మళ్ళా ఆవు అయిపోయి భక్తిగా పటాసుగాడిని ప్రార్థించాడు. రూపాయి తన దగ్గర లేదన్నాడు.

రేపు. రేపంటే రేపు.

రూపాయి. రూపాయంటే రూపాయి; ఇచ్చేస్తానన్నాడు.

"ఏ మనిషికయినా, దేవుడు తన పడి 'నీకేంకావాలో కోరుకో' అని అడిగితే విద్యా, బుద్ధి, కళ అన్నీ వదిలేసి, 'అన్నం!' అని అడిగే దౌర్భాగ్యస్థితికి నాదేశం రాకూడదు మొర్రో" అన్నాడు మహాత్మాగాంధీ.

భగవంతుడి దయవుంటే, ఒక దేవిటి పది అయినా ఇస్తానన్నాడు.

పటాసుగాడు యిదంతా విన్నాడు. వాడికి చాలా సరదాగా వుంది. పులివేషం వాడికి చాలా గర్వాన్నిచ్చింది. ఇప్పుడు తను శివుణ్ణి కొట్టగలడు. కొడితే వాడు ఎవడి కాళ్ళో పట్టుకుని రూపాయీ యిచ్చేస్తాడు. ఇచ్చిన వెంటనే ఆవువేషం తీసేసి తన మొహంమీద విసిరేస్తాడు.

అంచేత పటాసుగాడు, సాధ్యమయినంత క్రూరంగా నవ్వి ''సరే ఎల్లు'' అన్నాడు.

శివుడు టీ నీళ్ళు కూడా తాక్కుండా బయటపడ్డాడు.

''పోనీలే ఉపాసం'' అనుకున్నాడు శివుడు.

* * *

ఆలయంలో మొదటి భక్తునికోసం ఎదురు చూస్తున్నాడు నీలకంఠేశ్వరుడు.

* * *

శివుడు వూరు దాటాడు.

ఇక ఈ రోడ్డు శ్మశానంకేసి,

చీకటి వెన్నెల మిశ్రమంలో ఆ రోడ్డు వింతగా మెరుస్తోంది.

శివుడు గబగబా నడుస్తున్నాడు. ఎదురుగా నీలకంఠేశ్వరస్వామి కోవెల గోపురం కనిపిస్తూంది. చుట్టూ శ్మశానం అంతటా

ఏదో సందడిగా వున్నట్టనిపించింది అతనికి.

దూరంగా ఓ చితి.

గడచిపోయిన జీవితానికి మంగళ హారతిలా చితి కాలుతోంది. కోవెల పక్కనే చెరువు.

చెరువులో నీరు చల్లగా నల్లగా వుంది. శివుడు చెరువులో దిగాడు.

* * *

అప్పుడే నీలకంఠేశ్వరుడు శివుణ్ణి చూశాడు. మొదటి భక్తుడు. దేవుడు ఒక్క చిరునవ్వు నవ్వేడు.

కోవెల్లో సిద్ధంగా వున్నాడు పూజలందుకోవడానికి భగవంతుడు.

పూజారి యింకా రాలేదు. కోవెల తలుపులు మూసి వున్నాయి.

గుడిలో శివుడికి కోపం వచ్చింది పూజారి మీద. మొదటి భక్తుడు అప్పుడే వచ్చేశాడు. పూజారి జాడలేదు.

"దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వలేదు" అనుకున్నాడు.

శివుడు చెరువులోనుండి బయటకు వచ్చాడు. చల్లగా హాయిగా ఉంది. ఒంటిమీద నీటి చుక్కలు గిలిగింతలు పెడుతున్నాయి.

ఒళ్ళు తుడుచుకున్నాడు. మెల్లగా ముందుకు నడిచాడు.

తెల్లవారుజాము మూడుగంటలయింది. ఓ గోనెముక్క దులిపి కోవెల తలుపు దగ్గర కూర్చున్నాడు. పూజారి వచ్చాడు. కోవెల తలుపులు తెరిచాడు.

గంటలు మోగుతున్నాయి.

ధూపం, దీపం, నైవేద్యం సమకూర్తాయి. మంత్రాలు వినబడతాయి.

పూజలందుకొంటాడు గదిలో శివుడు.

పూజలొనర్చడానికా అన్నట్టు గుడి బయట శివుడు. గుడిబయట శివుడికి భక్తి భావం పొంగి పొరలవలసిందే. కానీ పటాసుగాడు రూపాయి కాగితాన్ని ఆనకట్టగా పడేశాడు.

గుడిలోన శివుడికి ఆత్రంగా వుంది.

ఈ భక్తుడు పూజ మొదలెట్టడేమి?

ఇంకో గడియలో భక్తులు తండోపతండాలుగా వస్తారు. కొబ్బరికాయలు పగులుతాయి.

ధూపంతో ఊపిరాడదు తనకి.

అదీగాక ఇంకో అరగంటలో రికార్డులు వేస్తారు.

"రా! నారాజా!" అన్నపాట అసలు నచ్చదు తనకి.

ఇప్పుడు అంతా నిశ్శబ్దంగా ఉంది. ప్రశాంతంగా ఉంది.

ఈ మొదటి భక్తుడు యిప్పుడుగాని పూజిస్తే వాడికి ఏమైనా యివ్వడానికి సిద్ధంగా వున్నాడు గుడిలోన శివుడు.

గుడిబయట శివుడికి ఇదంతా ఏమీ తెలీదు. అతను కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు.

దూరంగా ఓ ముసలివాడు స్నానంచేసి వీబూధి ధరించి వస్తున్నాడు; రెండవభక్తుడు.

గుడిలోన శివుడికి ఆత్రం ఎక్కువయింది.

ఫలం ఇంకొకరికి దక్కుతోంది.

మొదటి భక్తుడు ఏమీ ప్రార్థించడం లేదెందుకని?

ఆఖరికి శివశివా అయినా అనడేమి?

ముసలివాడు గుడిదగ్గరకు వచ్చేశాడు. గుడిలోన శివుడు మొదటి భక్తుడు ఏం పాట పాడతాడో అని కాసుక్కూర్చున్నాడు.

గుడిబయట శివుడికొచ్చింది ఒకటేపాట, ఆకలి పాటంటారు దాన్ని!

అందుచేత; గుడిబయట శివుడు దగ్గరగా వచ్చిన ముసలివాడివైపు చేతులు జోడించి, ముందుకు వంగి, దీనాతి దీనంగా "అయ్యా! ఒక పైసా ధర్మంచెయ్యయ్యా!" అని వేడుకున్నాడు. *